పసిడి రుణాలకు కళ్లెం!

నిబంధనలను కఠినతరం చేసే యోచనలో రిజర్వుబ్యాంక్

న్యూఢిల్లీ, మార్చి 7: పసిడి రుణాలకు కళ్లెం వేయడానికి రిజర్వు బ్యాంక్ సిద్ధమవుతున్నది. ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటున్న గోల్డ్ లోన్లకు చెక్ పెట్టడానికి త్వరలో కఠిన నిబంధనలను అమలులేకి తేవాలని చూస్తున్నది. ఇందుకు సంబంధించి బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు జారీ చేస్తున్న గోల్డ్ లోన్లపై నిఘా పెట్టాలని సూచించింది. గోల్డ్ లోన్ తీసుకున్నవారు ఈ నిధులను దేనికి వినియోగిస్తున్నారు.. అసలు బంగారం వారిదేనన్న దానిపై పూర్తి వివరాలు సేకరించాలని బ్యాంకులకు సూచించింది. గడిచిన ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతానికి పైగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసిన సెంట్రల్ బ్యాంక్.. దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే రుణాలు అత్యధికంగా తీసుకుంటున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న రుణాలు వారు దేనికి వినియోగిస్తున్నారన్న విషయంపై మానిటర్ చేయాలని సూచించింది. రుణాలు తీసుకున్నవారి కుటుంబ వివరాలు, పసిడి వారిదేనా లేకపోతే ఇతరవారు వీరిపై తీసుకుంటున్నారా అనేదానిపై సమాచారం సేకరించాలని పేర్కొంది. ఇటీవలకాలంలో తమవద్ద ఉన్న బంగారాన్ని వేరేవారి పేరుమీద తీసుకొని ఇతర పెట్టుబడులు పెడుతున్నారనే సమాచారం ఆధారంగా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. ఒకవేళ తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించనియెడల ఈ బంగారాన్ని వేలం వేసే అవకాశం ఉంటుంది.

ఆరు నెలల్లో 50 శాతం వృద్ధి

పసిడి తాకట్టుపై రుణాలు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరగడంతో సెంట్రల్ బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు పసిడి రుణాలు 50 శాతం పెరిగాయి. పసిడి వినియంలో రెండో అతిపెద్ద దేశమైన భారత్‌లో గోల్డ్ లోన్లకు అత్యధిక మంది ఆకర్షితులవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్లపై పరిమితులు విధించిన విషయం తెలిసిందే. గడిచిన 12 నుంచి 16 నెలల మధ్యకాలంలో నాన్-బ్యాంకింగ్ సంస్థలు జారీ చేసిన గోల్డ్ లోన్లపై ఆర్బీఐ ఆడిటింగ్ నిర్వహించగా, దీంట్లో ఎన్నో అనుమానాలు తలెత్తాయని, తీసుకున్నవారిలో సగానికి పైగా మంది వేరే అవసరాలకు వినియోగించారనే అనుమానం వ్యక్తంచేసింది.

ఐఐటీ హైదరాబాద్‌తో కోలిండియా జట్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : పర్యావరణహిత, ఉద్గార రహిత బొగ్గు, ఇంధనాలపై పరిశోధనలకోసం ఐఐటీ హైదరాబాద్‌తో కోల్ ఇండియా కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ.98 కోట్ల గ్రాంట్‌తో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో(క్లీన్జ్) సంస్థను ఐఐటీహెచ్‌లో నెలకొల్పేందుకు ఇరు సంస్థలు జట్టుకట్టాయి. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి సమక్షంలో కోల్‌ఇండియా సీఎండీ పీఎం ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర బీఎస్ మూర్తిలు పరస్పర ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ వృద్ధికి బొగ్గురంగం అతి ముఖ్యమైనదని, ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన వనరుగా కొనసాగుతున్న గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదన్నారు.

ఉత్పాదక వ్యయం తగ్గాలి: సింగరేణి సీఎండీ బలరాం

బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడే సంక్షేమం సాధ్యమని, ఉద్యోగుల పని సంస్కృతి మరింత మెరుగుపడాల్సిన అవసరముందని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణిభవన్‌లో 38వ స్ట్రక్చర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సింగరేణి బొగ్గు విక్రయ ధరలు కోల్ ఇండియా, విదేశీ బొగ్గు కన్నా అధికంగా ఉన్నాయని, దీంతో ఈ బొగ్గుకు డిమాండ్ క్రమంగా పడిపోతున్నదని, ఇది ఆందోళనకరమని ఆయన వ్యాఖ్యానించారు. బొగ్గు ఉత్పాదక వ్యయం రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుందన్నారు.

పెన్షన్ మొత్తాన్ని పెంచండి

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ మొత్తాన్ని పెంచాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్‌రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాంలను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు రామచందర్‌రావు తెలిపారు.

కొలువులు ఆగమాగం

అన్ని రంగాలకూ ట్రంప్ సుంకాల సెగ • ఆందోళనలో ఉద్యోగుల భవిష్యత్తు

ఇప్పటికే మందగమనంలో దేశ జీడీపీ వృద్ధి • గుబులు పుట్టిస్తున్న కొత్త సవాళ్లు



న్యూఢిల్లీ, మార్చి 7: అమెరికా అధ్యక్షుడి పోకడ.. ఆయా దేశాల్లో పెద్ద ఎత్తునే ఉద్యోగుల ఉసురు తీసేలా ఉన్నది. ఆ జాబితాలో భారత్ కూడా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. అవును.. ఇప్పటికే ద్రవ్యోల్బణం, తయారీసహా కీలక రంగాల్లో నిస్తేజం, జీడీపీ వృద్ధిరేటు మందగమనం, అధిక వడ్డీరేట్ల వంటి సమస్యలతో సతమతమవుతున్న దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగాన్ని ఇప్పుడు అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు భయపెడుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై సుంకాలుంటాయంటున్న ట్రంప్ ప్రకటనలు నిజమైతే.. ఇండస్ట్రీ కుదేలవడం ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ముఖ్యంగా భారతీయ తయారీ, ఎగుమతుల రంగాలకు గట్టి ఎదురుదెబ్బేనంటున్నారు.

ఇదీ సంగతి..

'ఈ ఇంటికి ఆ ఇల్లు ఎంత దూరమో.. ఆ ఇంటికి ఈ ఇల్లూ అంతే దూరం' అంటున్నారు యూఎస్ బాస్ ట్రంప్. దీంతో ఆయా రంగాల్లో ఇప్పుడు అమెరికా వస్తూత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలకు తగ్గట్టుగా భారతీయ వస్తూత్పత్తులపై అమెరికా సుంకాలను వేయనున్నది. భారతీయ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ విషయానికే వస్తే.. ట్రంప్ సుంకాల ప్రభావం దీనిపై భారీగానే ఉండే వీలున్నది. ప్రస్తుతం భారతీయ నగలకు అమెరికాలో మంచి డిమాండ్ ఉన్నది. దీంతో అక్కడికి మన ఎగుమతులు భారీగానే జరుగుతున్నాయి. అయితే సుంకాలు పెంచితే వీటి ధరలు అమాంతం పెరిగిపోతాయి. దాంతో వ్యాపారాలకు దెబ్బే. అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న జ్యువెల్లరీపై వాటి విలువలో కేంద్ర ప్రభుత్వం 20 శాతాన్ని సుంకాలుగా వసూలు చేస్తున్నది. కానీ భారత్ నుంచి అమెరికాకు చేరుతున్న నగలపై అక్కడ పడుతున్నది గరిష్ఠంగా 5.5-7 శాతమే. ఇక సానబెట్టిన వజ్రాలపై ఇక్కడ 5 శాతం సుంకం పడితే.. అమెరికాలో ఏమీ లేదు. ఈ లెక్కన ట్రంప్ హెచ్చరించినట్టుగా సుంకాలు పడితే జెమ్స్ అండ్ జ్యువెల్లరీ ఇండస్ట్రీ కుదేలైనట్టే. దేశంలో 2 లక్షలకుపైగా జనాభా ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్నది. వీరిలో మహిళలే ఎక్కువ. ఇప్పుడు టారిఫ్‌ల సెగ వీరందరికీ తగులుతున్నట్టే. ఇలాగే అనేక రంగాల పరిస్థితి నెలకొన్నది.

ఐటీ రంగానికీ తిప్పలే

భారతీయ ఐటీ రంగానికున్న ప్రధాన మార్కెట్లలో అమెరికా ఒకటి. అయితే తొలిసారి అగ్రరాజ్య అధ్యక్షుడైనప్పుడే దేశీయ ఐటీ రంగాన్ని ట్రంప్ తీవ్రంగా దెబ్బతీశారు. వీసా నిబంధనలు కఠినతరం, ప్రాజెక్టుల్ని దూరం చేయడం, అమెరికాలో అమెరికన్లతోనే పనిచేయించాలనడం వంటివి ఇండియన్ ఐటీ ఇండస్ట్రీకి ఇబ్బందుల్ని తెచ్చిపెట్టాయి. ఇక్కడి ఐటీ ఉద్యోగ నియామకాలనూ ప్రభావితం చేశాయి. అమెరికాలోనూ భారతీయులకు ఉద్యోగాలు తగ్గిపోయాయి. మళ్లీ ఇప్పుడు ట్రంప్ రావడంతో ఐటీ రంగంలోనూ ప్రకంపనలు మొదలవుతున్నాయి. ఇప్పటికే ఏఐ దెబ్బకు రిక్రూట్‌మెంట్లు మందగించిన విషయం తెలిసిందే. మొత్తానికి ట్రంప్.. ప్రధాని మోదీకి మధ్య సత్సంబంధాలే ఉన్నప్పటికీ.. దేశ ప్రయోజనాలే ముందు అంటున్నారు ట్రంప్. నిజానికి అమెరికా మోటర్‌సైకిళ్లు, విస్కీలపై 20 నుంచి 50 శాతం మేర సుంకాలను కేంద్రం తగ్గించింది. మరికొన్నింటిపైనా సమీక్ష జరుపుతున్నది. మరోవైపు వాణిజ్య మంత్రి గోయల్ అమెరికాలో చర్చల కోసం వెళ్లారు. ఇవన్నీ ఏ మేరకు ఫలిస్తాయో చూడాల్సిందే.

జాబ్ మార్కెట్ మటాష్!

ఇటీవలికాలంలో జాబ్‌మార్కెట్ అల్లకల్లోలంగానే తయారైంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) దెబ్బకు ఉద్యోగావకాశాలు భారీగానే కోల్పోవాల్సి వస్తున్నది. దీనికితోడు దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులతో కంపెనీల ఆదాయాలు, లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా కొత్త నియామకాలు అంతంతమాత్రంగానే తయారయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా సుంకాలను పెంచితే.. ఆ ప్రభావం అక్కడి మార్కెట్‌లో మన వస్తువులకున్న డిమాండ్‌ను తప్పక ప్రభావితం చేయగలదు. ఇదే జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి ఎగుమతులు పడిపోయి.. ఉత్పత్తి మందగిస్తుంది. దాంతో అంతిమంగా నష్టపోయేది ఉద్యోగులేనన్నది మార్కెట్ నిపుణుల విశ్లేషణ. నిజానికి కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే మార్కెట్ కోలుకుంటున్నది. ఈ సమయంలో ట్రంప్ సుంకాల పిడుగు అంగట్లో గట్టిగానే అలజడులను సృష్టిస్తున్నదని చెప్పవచ్చు.

సుంకాలతో ఇబ్బందులు	ప్రభావిత రంగాలు	ఉపశమనం ఎలా?
భారంగా ఎగుమతుల ఖర్చులు	రత్నాలు, ఆభరణాలు	తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
పడిపోనున్న మార్కెట్ వాటా	ఫార్మా ఇండస్ట్రీ	పరిశ్రమలకు పన్ను మినహాయింపులు
తయారీ రంగం కుదేలు	ఉక్కు, అల్యూమినియం	సులభంగా రుణ లభ్యత
ఉద్యోగుల తొలగింపులు	టెక్స్‌టైల్స్ పరిశ్రమ	విదేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
ఆర్థిక వ్యవస్థలో మందగమనం	ఎలక్ట్రానిక్స్	వినియోగదారుల కొనుగోలు శక్తి బలోపేతం

- *టారిఫ్‌ల దెబ్బకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో అమెరికాకు భారతీయ ఎగుమతులు 2 నుంచి 7 బిలియన్ డాలర్ల మేర పడిపోయే అవకాశం ఉందంటున్న ఇండియా రేటింగ్స్.*
- *ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-డిసెంబర్‌లో అమెరికాకు భారత ఎగుమతులు గతంతో పోల్చితే 5.57 శాతం పెరిగి 59.93 బిలియన్ డాలర్లుగా నమోదు. అమెరికా నుంచి దిగుమతులు కూడా 1.91 శాతం పెరిగి 33.4 బిలియన్ డాలర్లకు చేరిక.*
- *అమెరికా పెంచే సుంకాలతో భారత జీడీపీ వృద్ధిరేటు 5 నుంచి 10 బేసిస్ పాయింట్లు క్షీణించే వీలుందంటున్న ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్రకుమార్ పంత్.*

మహిళలకు ఎస్బీఐ చౌక రుణాలు

'నారీ శక్తి' డెబిట్ కార్డు పరిచయం

ముంబై, మార్చి 7: ఔత్సాహిక మహిళా వ్యాపార, పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీరేటుకే పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేస్తామని శుక్రవారం ఎస్బీఐ ప్రకటించింది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో 'అస్మిత' పేరిట ఈ ప్రత్యేక లోన్లకు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం శ్రీకారం చుట్టింది. బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ.. మహిళల ఆధ్వర్యంలో నడిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు వేగంగా, సులభంగా ఈ రుణాలను అందజేస్తామన్నారు. ఇదిలావుంటే 'నారీ శక్తి' ప్లాటినమ్ రూపే డెబిట్ కార్డునూ ఎస్బీఐ ఈ సందర్భంగా తీసుకొచ్చింది.

బీవోబీ నయా అకౌంట్స్

ప్రవాస భారతీయ మహిళల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా శుక్రవారం 'బోవోబీ గ్లోబల్ వుమెన్ ఎన్‌ఆర్‌ఈ, ఎన్‌ఆర్‌వో సేవింగ్స్ అకౌంట్'ను అందుబాటులోకి తెచ్చింది. గృహ, వాహన రుణాలపై చౌక వడ్డీ, తక్కువ ప్రాసెసింగ్ చార్జీలు, లాకర్ అద్దెపై 100 శాతం రాయితీ, ఎయిర్‌పోర్టుల్లో ఉచితంగా దేశీయ, అంతర్జాతీయ లాంజ్ సౌకర్యం పొందేలా కస్టమైజ్డ్ డెబిట్ కార్డు వంటి ప్రయోజనాలు ఈ ఖాతాదారులకుంటాయి.

ఎంఎస్‌ఎంఈలకు ప్రత్యేక క్లస్టర్లు

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకుగాను ఎంఎస్‌ఎంఈలకోసం ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎఫ్‌టాప్సీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో 'ఎంఎస్‌ఎంఈ స్పార్క్-2.0' పేరిట ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, వారి ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసుకొనేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి

పొలంబాటలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

లింగంపేట, మార్చి 7: రైతులు వ్యవసాయ బోరు బావుల వద్ద కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ మల్లేశ్ సూచించారు. మండలంలోపి మోతె గ్రామంలో శుక్రవారం పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏడీఈ మల్లేశ్ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సొంతగా విద్యుత్ పనులు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో లింగంపేట ఏఈ సాయినాథ్ సిబ్బంది లక్ష్మీనారాయణ, ఆదిరెడ్డి, మోతీలాల్, అనిల్, ప్రసాద్, వహీద్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వజ్రోత్సవం

రామారెడ్డి(సదాశివనగర్), మార్చి 7: సదాశివనగర్ మండలంలోని కల్వరాల్ ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరై.. పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటుచేసిన ల్యాబ్‌ను ప్రారంభించారు. తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పూర్వ విద్యార్థులు బ్యాచ్‌ల వారీగా కేక్ కట్‌చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 1200మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ పరికరాల వినియోగంపై అవగాహన

నాగిరెడ్డిపేట, మార్చి 7: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం డిజిటల్ పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. షీ టీమ్ జిల్లా సభ్యులు ఎంఎస్ ప్రభాకర్, శేషాద్రి, సాయిలు, శ్రీనివాస్, సుప్రజ తదితరులు సమాజంలో జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు. నేరాలు, వాటితో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. షీ టీమ్, సైబర్ క్రైమ్ స్టేషన్ల నుంచి తగిన సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులను ప్రిన్సిపాల్ రాంప్రసాద్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

పల్లె దవాఖాన సందర్శన

నాగిరెడ్డిపేట, మార్చి 7: మండలంలోని ఆత్మకూర్ పల్లె దవాఖానను జాతీయ క్వాలిటీ ప్రోగ్రామ్ అధికారిణి రాధిక శుక్రవారం సందర్శించారు. దవాఖానలో కలియ తిరిగారు. రికార్డులు, పరసరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పల్లె దవాఖాన నిర్వహణ, విధులు, బాధ్యతలపై వైద్యులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి పద్మజ, క్వాలిటీ మేనేజర్ జహీరా, వైద్యాధికారి సృజన్‌కుమార్, మేల్ వర్కర్ మురళి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

'ఉపాధి' సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, మార్చి 7: కూలీలు ఉపాధి హామీ పథకం పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని ఒంటర్‌పల్లి గ్రామంలో చేపడుతున్న ఫాంపాండ్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లా కేంద్రంలో ఏఎస్పీ చైతన్యారెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్

కామారెడ్డి, మార్చి 7 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో పని చేస్తున్న మహిళా ఉద్యోగినులతోపాటు ఆయా శాఖల్లో పని చేస్తున్న మహిళా అధికారులను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి నాగరాణి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ చైతన్యారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిణి స్రవంతి, ఐసీడీఎస్ సిబ్బంది, సీడీపీవోలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయ స్థానంలో..

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయ స్థానంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్.వీఆర్‌ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని ఉద్యోగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. అనంతరం మహిళా న్యాయవాదులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, న్యాయశాఖ ఉద్యోగ సంఘం సభ్యులు భుజంగరావు, వెంకటరెడ్డి, రషీద్ అలీ, నాగేందర్, చంద్రసేన్‌రెడ్డి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం..

బాన్సువాడ, మార్చి 7 : మహిళల సంక్షేమం కేవలం కేసీఆర్, బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని కామారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో కల్యాణ లక్ష్మి, డబుల్ బెడ్ రూం ఇండ్లు, పుట్టిన బిడ్డను మొదలుకొని.. వృద్ధుల వరకు పింఛన్‌ను పెంచి అందజేసింది కేసీఆర్ సర్కార్ అని కొనియాడారు. ఆడబిడ్డ పుడితే కేసీఆర్ కిట్‌తోపాటు రూ.13 వేలు అందించడం తదితర ఎన్నో మహిళా సంక్షేమ పథకాలను అందించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని అన్నారు.

అహల్యాబాయి హోల్కర్‌ను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి

బాన్సువాడ టౌన్, మార్చి 5 : బాన్సువాడలోని బాలికల జడ్పీహెచ్‌ఎస్‌లో అహల్యాబాయి హోల్కర్ జయంతిని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వనిత అని, మహిళలు అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం అన్నారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయినులను సన్మానించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్, సంతోష్, మహిళా జిల్లా కన్వీనర్ ఉమాదేవి, సంధ్యారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు వేదప్రకాశ్, మండల అధ్యక్షులు నరసింహాచారి, శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సన్మానించిన దృశ్యం

పోలీసులకు ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న పోలీసులు

కామారెడ్డి, మార్చి 7 : కామారెడ్డి జిల్లా కేంద్రంలో రంజాన్ పండుగ సందర్భంగా పట్టణ పోలీసు స్టేషన్, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులకు ముస్లింలు శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, పోలీసులు, ముస్లింలు పాల్గొన్నారు.

రెండు బెల్ట్ షాపులపై దాడి

బీబీపేట్, మార్చి 7 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్ షాపులపై ఎస్సై ప్రభాకర్ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశారు. 10 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నస్రుల్లాబాద్, మార్చి 7: బీర్కూర్ మండలం అన్నారం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. అన్నారం గ్రామానికి చెందిన అంజవ్వ రేకుల ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు కాలిపోయాయి. అప్రమత్తమైన అంజవ్వ తన కుటుంబ సభ్యులతో బయటికి రావడంతో ప్రాణ నష్టం తప్పింది. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపింది.

నాణ్యమైన భోజనం అందించాలి

నస్రుల్లాబాద్, మార్చి 7 : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని నస్రుల్లాబాద్ మండల ప్రత్యేకాధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మైలారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, గ్రామ కార్యదర్శి సవిత ఉన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాల్లో జన ఔషధి దివస్

రామారెడ్డి, మార్చి 7: సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి సబ్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం జన ఔషధి దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనరిక్ మందుల విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ

బీబీపేట్, మార్చి 7 : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ మానసిక ప్రశాంతతపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే పరీక్షలు బాగా రాయగలమన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, జిల్లా సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్ కుమార్, సూపర్‌వైజర్ పద్మావతి, సుజాత, వీణ, రజిత, దివ్య, ఆరోగ్య కార్యకర్త పుష్ప, ఆశవర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గాంధారి, మార్చి 7: గాంధారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద గుజ్జుల్ తండాకు చెందిన జరుపుల తుకారాం(45) రాత్రి ఏడు గంటల సమయంలో మండల కేంద్రం నుంచి తండాకు బైకుపై బయల్దేరాడు. గాంధారి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేశాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మద్దెల రవి బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తుకారాం బైకుపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రవి కాలు విరిగింది. విషయం తెలుసుకొని పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని దవాఖానకు తరలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

హెచ్‌ఎం మిత్రుల సేవలు అభినందనీయం

డీఈవో రాజు

మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న డీఈవో

బిచ్కుంద, మార్చి 7: పాఠశాల అభివృద్ధికి సహకరించిన పుల్కల్ జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ మిత్రులు అభినందనీయులని డీఈవో రాజు అన్నారు. పాఠశాలలో అత్యవసర వసతులు తీర్చుకోవడానికి ఇబ్బందులు ఉండడంతో హెచ్‌ఎం ఆనంద్ విషయాన్ని అతడి మిత్రులకు తెలిపాడు. దీంతో వారు స్పందించి రూ.రెండున్నర లక్షలతో పాఠశాలలో ఆరు మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించారు. వాటిని డీఈవో శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులను సన్మానించారు. అనంతరం డీఈవో మండలంలోని గుండెనెమ్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇర్షాద్ అలీ, ప్రమోద్, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విహారయాత్రకు తరలిన విద్యార్థులు

నెహ్రూ జులాజికల్ పార్కు వద్ద పోల్కంపేట విద్యార్థులు

గాంధారి/ లింగంపేట, మార్చి 7: పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా గాంధారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 6, 7వ తరగతి విద్యార్థులు శుక్రవారం విహారయాత్రకు తరలివెళ్లారు. డిచ్‌పల్లి రామాలయం, సారంగపూర్ హనుమాన్ ఆలయం, బాసర సరస్వతీ దేవాలయాలతోపాటు గుత్ప ఎత్తిపోతల పథకాన్ని విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రంగా వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చారిత్రక, పురాతన కట్టడాలపై అవగాహన పెంచేందుకు ఇలాంటి యాత్రలు తోడ్పడుతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. లింగంపేట మండలం పోల్కంపేట గ్రామంలోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం విహారయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని చార్మినార్, నెహ్రూ జులాజికల్ పార్క్, మెదక్ చర్చిని సందర్శించినట్లు హెచ్‌ఎం రాములు తెలిపారు. కార్యక్రమంలో టీచర్ మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.